క్లుప్తంగా

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఆల్కాట్‌తోట శాఖా గ్రంథాలయంలో గురువారం నుంచి ఈ నెల 20 వరకూ 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథపాలకులు కొత్తపల్లి రమ్యశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా పుస్తక ప్రదర్శన, వ్యాసరచన, చిత్రలేఖనం, సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తామన్నారు. పాఠకుల నుంచి తిరిగిరాని పుస్తకాలను ఈ వారోత్సవాలలో వాపసు చేసిన వారికి అలస్య రుసుము మినహాయింపు ఇస్తామన్నారు.

కమలాకరరావు మృతి తీరని లోటు



మౌనం పాటిస్తున్న ప్రిన్సిపల్ నాగలక్ష్మి తదితరులు

సీటీఆర్‌ఐ: ప్రఖ్యాత మృదంగ విద్వాంసుడు వరదరావు కమలాకరరావు మృతి సంగీత లోకానికి తీరని లోటు అని విజయ శంకర ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.నాగలక్ష్మి అన్నారు. ఈ మేరకు పాఠశాలలో బుధవారం సంతాపం తెలిపారు. రాజమహేంద్రవరం నగరానికి చెందిన ప్రముఖ మృదంగ విద్వన్మణి, ప్రపంచ ప్రఖ్యాత మృదంగ విద్వాంసుడు వి.కమలాకరరావు ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ మౌనం పాటించారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక బృందం, కార్యాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక

కడియం: యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గ ఎన్నిక బుధవారం వేమగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగింది. జిల్లా కోశాధికారి ఈవీఎస్ఆర్ ప్రసాద్, రాష్ట్ర కౌన్సిలర్ సాకా అనిత నేతృత్వంలో జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎం.శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి కె.రమేష్ బాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడిగా వి.హనుమంతరావు, అధ్యక్షుడిగా వీవీఎస్ శాస్త్రి, ప్రధాన కార్యదర్శిగా బి.అబ్బాయి, ఉపాధ్యక్షులుగా ఎ.దొరబాబు, ఎం.వనజ, కోశాధికారిగా పీవీ గోపాలకృష్ణను ఎన్నుకున్నారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా ఇటీవల జరిగిన క్రీడా పోటీల్లో విజేతలకు, ఉపాధ్యాయులకు బహుమతులు అందించారు. త్వరలో ఉద్యోగ విరమణ చేయనున్న ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో మండలంలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చినకొండేపూడిలో చోరీ

సీతానగరం: మండలంలోని చినకొండేపూడిలో జరిగిన దొంగతనంపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై డి.రామ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నీలగిరి రాజేష్ మంగళవారం తాళ్లపూడి మండలం ప్రక్కిలంక గ్రామంలో తన తమ్ముడు వివాహానికి వెళ్లాడు. తిరిగి బుధవారం ఉదయం ఇంటికి వచ్చాడు. లోపలకు వెళ్లే సరికీ బీరువా తెరచి ఉంది. దానిలోని అరకాసు బంగారు ఉంగరం, దుద్దులు, రూ.50 వేలు కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అరకొర తాగునీరు

- గోదావరి చెంతనే నీటికి కటకట
- ఒక్క పూటే వదులుతున్న వైనం
- కుళాయిల నుంచి సన్నని ధారలు
- బిందె నిండడానికే అరగంట సమయం



44వ డివిజన్‌లో కుళాయి నుంచి సన్నని ధారతో వస్తున్న నీరు

సీటీఆర్‌ఐ: అరకొరగా వస్తున్న తాగునీటితో నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గోదావరి చెంతనే ఉన్నా నీటి ఎద్దడి తప్పడం లేదు. వారం రోజులుగా కుళాయిల నుంచి పూర్తిస్థాయిలో తాగునీరు రావడం లేదు. కోటిలింగాలపేటలోని రామాలయం వీధిలో వారం రోజులుగా నీరు సక్రమంగా రావడం లేదు. కుళాయిల నుంచి సన్నని ధారలు రావడంతో బిందె నిండటానికి కనీసం అరగంట పడుతోందని స్థానికులు వాపోతున్నారు. ఈ ప్రాంతంలోని లోతట్టు ప్రాంతంలో నీరు పర్వాలేదు కానీ ఎత్తు ప్రాంతంలో అస్సలు రావడం లేదు.

అక్రమ మోటార్లు

కోటిలింగాలపేటలో నీటి ఎద్దడి కారణంగా కుళాయిల నుంచి నీరు మొదలవ్వగానే కొందరు మోటారు పెట్టి అక్రమంగా నీటిని లాగుతున్నారు. ఇలా చేయడం వల్ల వారికి నీరు దొరుకుతున్నప్పటికీ మోటారు లేనివారు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అక్రమ మోటార్లపై నగరపాలక సంస్థ దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ ప్రాంతానికి దగ్గరలోనే గోదావరి ఉంది. కానీ దానిలో నీరు నేరుగా తెచ్చుకుని వాడుకోవడం కుదరదు. ఆ నీరు మురికిగా ఉండడమే కాకుండా చెత్త, వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. అపరిశుభ్రంగా ఉండే ఆ నీటిని వాడుకోవడానికి ప్రజలు భయపడుతున్నారు.

ఒక్కపూటే నీటి సరఫరా

నగరంలో ప్రతి రోజూ 67 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేస్తారు. దీని కోసం అర్బన్‌లో 29 రిజర్వాయర్లను ఏర్పాటు చేశారు. గోదావరి పక్కనే ఉన్నప్పటికీ ఇప్పటికీ కొన్ని చోట్ల మాత్రమే రెండు పూటలా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఎక్కువ ప్రాంతాల్లో ఒక పూట మాత్రమే అందిస్తున్నారు. మరికొన్నిచోట్ల ఆ ఒక్క పూట కూడా అందక ప్రజలు అవస్థలు పడుతున్నారు.



41వ డివిజన్‌లో తాగునీటి కుళాయి నుంచి వస్తున్న నీరు

నగర శివారున ఇబ్బందులు

నగర శివారు ప్రాంతాలైన 40, 41, 42, 43, 44, 45, 46, 47, 48, 49, 50 డివిజనల్లో ప్రజలు నీటి కోసం అనేక ఇబ్బందులు పడుతున్నారు. అరకొరగా విడుదల చేసే నీరు కూడా కుళాయిల నుంచి సన్నని ధారగా వస్తుండడంతో ఏమి చేయాలో తెలియడం లేదు.

నీటి కష్టాలు



కోటిలింగాలపేటలో రామాలయం వద్ద ఒక్క పూట కూడా తాగునీరు రావడమే కష్టంగా ఉంది. మా ప్రాంతంలో సన్నని ధారగా వస్తుండడంతో బిందె నిండటానికి దాదాపు అరగంటకు పైగా పడుతోంది. దీనితో మినరల్ వాటర్ టిన్నులను కొనుగోలు చేసుకుంటున్నాం. అధికారులు స్పందించి మాకు రెండు పూటలా తాగునీరు అందించాలి.

– పెదిరెడ్డి అమ్మాజీ

పట్టించుకోండి



తాగునీరు సక్రమంగా రాక తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. కుళాయి పన్నును సమయానికి చెల్లిస్తున్నాం. ఒకవేళ కట్టకపోతే కనెక్షన్ వెంటనే తీసివేస్తున్నారు. కానీ తాగునీరు రావడం లేదని చెప్పినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు చేపట్టాలి.

– కొమర్తి గంగ

కొనసాగిన ట్రైనీ కలెక్టర్ల పర్యటన



కడియంలో మేట్‌లను పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్లు

కడియం: ట్రైనీ కలెక్టర్ల క్షేత్రస్థాయి పర్యటన రెండో రోజు బుధవారం కూడా కడియం మండలంలో కొనసాగింది. కడియం, కడియపులంక గ్రామాల్లో వీరికి ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. కడియంలో వివిధ చేతివృత్తుల స్టాళ్లను బృంద సభ్యులు పరిశీలించారు. కడియపులంకలో పూల మార్కెట్ తదితర చోట్ల పర్యటించారు. ఆయా గ్రామాల్లో సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు తీరుపై సంబంధిత లబ్ధిదారులతో మాట్లాడారు. వారి వెంట వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

కడియం: గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్‌ను స్థానిక లైబ్రరీలో హైస్కూల్ హెచ్‌ఎం టి.సత్యనారాయణ బుధవారం ఆవిష్కరించారు. గురువారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. గ్రంథాలయ సిబ్బంది శ్రీదేవి నిర్మల తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఇసుక సరఫరా

- కలెక్టర్ ప్రశాంతి
- ఇసుక ర్యాంపుల పరిశీలన



ఇసుక ర్యాంపు వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

కడియం: ఇసుక సరఫరా విధానం పారదర్శకంగా జరగాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. నియోజకవర్గంలోని ధవళేశ్వరంలోని గాయత్రి, వేమగిరిలోని ఇసుక ర్యాంపులను బుధవారం ఆమె పరిశీలించారు. లోడింగ్ చార్జీల విషయంలో అక్కడ విధుల్లో ఉన్న రెవెన్యూ అధికారి ప్రదీప్ వ్యవహార శైలిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం వినియోగదారులు, లారీ డ్రైవర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇసుకకు సంబంధించి వినియోగదారులు, లారీ డ్రైవర్లు ఇచ్చిన ఫిర్యాదులను రికార్డు చేయాలని అక్కడి సిబ్బందిని ఆదేశించామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న డీసిల్టేషన్ పాయింట్ల వద్ద టన్ను ఇసుక ఖర్చును రూ.229 మేర నిర్ణయించడం జరిగిందన్నారు. అదే విధంగా వాహనంలోకి ఇసుక లోడింగ్ ఖర్చు కూడా వినియోగదారులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ క్రమంలో హేతుబద్ధత కలిగి ఖర్చుల నిమిత్తం చెల్లింపులు జరపాలని కోరారు. అయితే ఇదే క్రమంలో ఖర్చులను ఇష్టానుసారం నిర్ణయించరాదని స్పష్టం చేశారు. బోట్స్‌మెన్ సొసైటీల సభ్యులు నదిలో ఇసుక తవ్వకాలు జరిపి, ఒడ్డుకు తీసుకువస్తారన్నారు. అక్కడి నుంచి లారీల్లోకి లోడింగ్ చేస్తామన్నారు. ఫిర్యాదు నమోదు కోసం జిల్లా స్థాయిలో 1800–425–540 , రాజమండ్రి డివిజన్ పరిధిలో 0883– 2442344 నంబర్లు అందుబాటులో ఉంచామన్నారు.

ఓపెన్ రీచ్‌ల వద్ద తవ్వకాల ఖర్చులు

ఓపెన్ రీచ్‌ల వద్ద ఇసుక తవ్వకాలకు సంబంధించి టన్నుకు నిర్ణయించిన ఖర్చుల వివరాలు ఇలా ఉన్నాయి. వేమగిరి–కడియపులంక రూ.61.37, వంగలపూడి(1) రూ.67.59, వంగలపూడి (2) రూ.70.19, ములకల్లంక – కాటవరం రూ.61.36, తీపర్రు – 2 రూ.96.02, తీపర్రు (3) రూ.96.02, ముక్కామల (2) రూ.116.49, కాకరపర్రు (1) రూ.117.02, పందలపర్రు రూ.104.42 , జీడిగుంట రూ.81.32, పెండ్యాల–కానూరు రూ.68.96 , కుమారదేవం రూ.80.27, చిడిపి రూ.78.17, కుమారదేవం (1) రూ.78.17, కుమారదేవం (3) రూ.91.82 , వేగేశ్వరపురం రూ.69.76గా నిర్ణయించారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం



నరసింహ కిశోర్, ఎస్పీ

కంబాలచెరువు: సైబర్ నేరగాళ్ల ఆగడాలు రోజు రోజుకి పెరిగిపోతున్నాయని, సాధారణ ప్రజల నుంచి అధికారుల వరకూ వీరి బారిన పడుతున్నారని ఎస్పీ డి.నరసింహ కిశోర్ అన్నారు. ఈ మేరకు బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలు అవగాహన ముఖ్యమన్నారు. తాజాగా ప్రభుత్వ పథకాల పేరుతో సైబర్ నేరగాళ్లు ఫోన్లు చేస్తున్నారన్నారు. తాము అమరావతి నుంచి కాల్ చేస్తున్నామని నమ్మించి బ్యాంకు ఖాతాలోని డబ్బులు కాజేస్తున్నారన్నారు. ఇలాంటి వాటిపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. వ్యక్తిగత సమాచారం, బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు వంటి వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికి చెప్పకూడదని స్పష్టం చేశారు. అనుమానిత నంబర్ల నుంచి వచ్చే కాల్స్‌కు స్పందించవద్దని సూచించారు. అపరిచిత వ్యక్తులను నమ్మి ఆన్‌లైన్‌లో డబ్బులు పంపించొద్దని సూచించారు. జిల్లా సైబర్ సెల్ అధికారుల ద్వారా జిల్లా అంతటా విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

కంబాలచెరువు: లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరమని, అలా చేసిన స్కానింగ్ సెంటర్లపై చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.శ్రీహరిబాబు హెచ్చరించారు. జిల్లాలోని పలు స్కానింగ్ సెంటర్లను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శ్రీహరిబాబు మాట్లాడుతూ రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలోని స్కానింగ్ సెంటర్లలో నిర్వాహకులు తప్పనిసరిగా లింగ నిర్ధారణ పరీక్షలు నిషేధం అనే బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. స్కానింగ్ రూమ్ బయట, స్కానింగ్ రూమ్ లోపల తగిన వివరాలతో డిస్‌ప్లే బోర్డు ఉంచాలన్నారు. ఫారం ఎఫ్‌ను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని, ఫారం ఎఫ్ రిజిస్టర్ మెయింటైన్ చేయాలని సూచించారు. నెలవారీ రిపోర్టును జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ కార్యాలయానికి పంపించాలని ఆదేశించారు. స్కానింగ్ సెంటర్‌లోని బిల్లు పుస్తకాలు, స్కానింగ్ రిపోర్ట్ మీద లింగ నిర్ధారణ పరీక్షల నిషేధం అని ముద్రించాలని సూచించారు. పీసీపీఎన్‌డీటీ చట్టానికి వ్యతిరేకంగా స్కానింగ్ సెంటర్లను నిర్వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్కానింగ్ సెంటర్ రిజిస్ట్రేషన్ అయిన వారు ఐదు సంవత్సరాల అనంతరం రెన్యువల్ చేయించుకోవాలన్నారు. రేడియాలజిస్ట్ మారినప్పుడు, స్కాన్ సెంటర్ వేరే చోటుకు మార్చినప్పుడు, అదనపు స్కాన్ మెషీన్ కొనుగోలు చేసేటప్పుడు అనుమతి తీసుకోవాలన్నారు.

వీధి కుక్కలను నియంత్రించాలి

సీటీఆర్‌ఐ: వీధి కుక్కలను నియంత్రించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ మహిళా అధ్యక్షురాలు డాక్టర్ అనుసూరి పద్మలత అన్నారు. ఈ మేరకు ఆమె బుధవారం ప్రకటన విడుదల చేశారు. రాబోయే పుష్కరాలకు రాజమహేంద్రవరానికి దేశవిదేశాల నుంచి లక్షల మంది యాత్రికులు తరలివస్తారన్నారు. 12 ఏళ్లకు ఒకసారి జరిగే పుష్కరాలకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. దీని కోసం నగరాన్ని ఇప్పటి నుంచే ముస్తాబు చేస్తామని మంత్రులు, ఎమ్మెల్యేలు చెబుతున్నారున్నారు. అయితే నగరంలో పాటు రెండు తెలుగు రాష్ట్రాల లోనూ వీధికుక్కల బెడద చాలా ఎక్కువగా ఉందన్నారు. గతంలో ఒక ఎన్జీవో సంస్థ రాజమహేంద్రవరంలో వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేయడానికి ముందుకు వచ్చి, కొద్ది రోజులు చేయడం జరిగిందన్నారు. కుక్క కాటువల్ల ప్రాణాంతకమైన రేబిస్ వ్యాధి వస్తుందన్నారు. అనేక చోట్ల చిన్న పిల్లలను వీధి కుక్కలు చంపివేస్తున్న ఘటనలు జరుగుతూనే ఉన్నాయన్నారు.

వైభవంగా లక్ష దీపోత్సవం



శంఖుచక్రాల ఆకారంలో వెలిగించిన దీపాలు

రాజమహేంద్రవరం సిటీ: క్షీరాబ్ది ద్వాదశి సందర్భంగా కంబాల చెరువు సమీపంలోని వెంకటేశ్వరస్వామి మఠంలో బుధవారం లక్ష దీపోత్సవం నిర్వహించారు. ఖండవల్లి పవన్‌కుమార్ ఆచార్యుల ఆధ్వర్యంలో వైభవంగా కార్యక్రమం జరిగింది. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా కార్తిక దీపోత్సవం

కడియం: క్షీరాబ్ది ద్వాదశిని పురస్కరించుకుని బుధవారం దుళ్లలోని బసవేశ్వరస్వామి ఆలయం వద్ద దీపోత్సవం నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం కార్తిక దీపాలను వెలిగించారు. భక్తుల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు, యువత పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఆర్టీసీ అధికారుల ఫోన్ నంబర్లు

జిల్లా ప్రజారవాణా అధికారి	షర్మిల అశోక	91542 91407
రాజమహేంద్రవరం డీఎం	షేక్ షబ్నం	99592 25535
డిపో అసిస్టెంట్ మేనేజర్	అజయ్‌బాబు	73829 12141
డిపో అసిస్టెంట్ ఇంజనీర్ (గ్యారేజ్)	ఎస్.నాగలక్ష్మి	79890 45549
సీనియర్ మెడికల్ ఆఫీసర్	ప్రసూనాంబ	97014 50208
డిప్యూటీ మెకానికల్ ఇంజనీర్ జోన్–2	రవిశంకర్	99592 25789
డీపీటీవో అకౌంట్స్ ఆఫీసర్	ఆర్‌వీ కోటేశ్వరరావు	99592 25529
అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ (కార్గో)	కె.మాధవ్	73311 47262
డీపీటీఓ పీఆర్ఓ	బి.శివకుమార్	73829 09283
చీఫ్ సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్	బి.మోహన్ కుమార్	73829 10603
రిజర్వేషన్ కార్యాలయం ఇన్‌చార్జ్	మహ్మద్ రియాజ్	99592 25561
డీపీటీఓ రీజినల్ కోర్ గ్రూప్ మెంబర్	జి.కృష్ణ	73829 09296
మెకానికల్ అసిస్టెంట్ ఇంజనీర్	జీఎల్ఎస్ మూర్తి	73829 11418
డీపీటీఓ ఆఫీస్ సూపరింటెండెంట్	టి.మల్లేశ్వరరావు	73829 09279
రాజమహేంద్రవరం బస్టాండ్ మేనేజర్	డి.త్రిమూర్తులు	73829 10187
హెవీ డ్రైవింగ్ స్కూల్ ట్రైనర్	వీఎస్ఎల్ రావు	99483 13344

స్వాతంత్య్ర పోరాటంలో ఆదివాసీలు కీలకం



బిర్సా ముండా చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న వర్సిటీ అధికారులు

రాజానగరం: దేశ స్వాతంత్య్రం కోసం జరిగిన పోరాటంలో ఆదివాసీలు కీలక పాత్ర పోషించారని ఆదికవి నన్నయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ అన్నారు. యూనివర్సిటీ సెమినార్ హాలులో బుధవారం గిరిజన స్వావలంబన వేడుకలను ఘనంగా నిర్వహించంఆరు. అటవీ జాతుల స్వాతంత్య్ర సమరయోధుడు బిర్సా ముండా చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ బిర్సా భగవాన్‌గా ఆరాధించబడుతున్న ఆ మహనీయుని స్మరించుకుంటూ యూనివర్సిటీలో కార్యక్రమం నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. వనవాసి కల్యాణ ఆశ్రమ్ జాతీయ సలహాదారు పి.స్వామియాజులు మాట్లాడుతూ ఉద్యమంతో పాటు గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడంలో కీలక పాత్ర పోషించిన బిర్సా భగవాన్ పుట్టినరోజును జాతీయ గిరిజన స్వావలంబన దినోత్సవంగా 2021లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుబ్బారావు, ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఆర్ఎస్ వరహాలదొర తదితరులు పాల్గొన్నారు.

చిన్న, సన్నకారు రైతులకు చేయూత



కాటవరంలో మాట్లాడుతున్న మైనర్ ఇరిగేషన్ అధికారి దుర్గేష్

సీతానగరం: మైక్రో ఇరిగేషన్ ద్వారా చిన్న, సన్నకారు రైతులకు సబ్సిడీ అందించి, చేయూత ఇస్తున్నట్టు జిల్లా మైనర్ ఇరిగేషన్ అధికారి ఎ.దుర్గేష్ తెలిపారు. మార్కెటింగ్, ఉద్యానవన శాఖ సంయుక్తంగా బుధవారం కాటవరంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గేష్ మాట్లాడుతూ బిందుసేద్యం యూనిట్లపై చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం సబ్సిడీ కింద రెండు హెక్టార్లు విస్తీర్ణం వరకు గరిష్టంగా రూ 2.18 లక్షల సబ్సిడీ అమలు జరుగుతుందన్నారు. కోస్టల్ ప్రాతంలోనిపెద్ద రైతులు 50 శాతం సబ్సిడీ కింద 2 నుంచి 5 హెక్టార్ల విస్తీర్ణం వరకు గరిష్టంగా రూ.3.09 లక్షల సబ్సిడీ పరిమితితో యూనిట్ల ఏర్పాటుకు అవకాశం ఉందన్నారు. కూరగాయలు పండించే రైతులకు సాగు పద్ధతులు, మెళకువలు, అధిక దిగుబడికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నీటి యాజమాన్యం, వ్యవసాయ పద్ధతులు, డ్రిప్ ఇరిగేషన్ స్ప్రింకర్ విధానం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ ఏడీ ఎం.సునీల్, వినయ్, మండల మైక్రో ఇరిగేషన్ అధికారి శైని తదితరులు పాల్గొన్నారు.

క్షయ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి

రాజానగరం: జిల్లాను క్షయ వ్యాధి రహితంగా తీర్చిదిద్దేందుకు వైద్యులు, సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వర్తించాలని జిల్లా అదనపు వైద్య,ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.వసుంధర అన్నారు. మండలంలోని పాలచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆమె తనిఖీ చేశారు. టీబీ బాధితులకు ప్రభుత్వం అందిస్తున్న నిక్షయ్ పోషణ యోజన (డీబీటీ) అందుతున్న తీరుపై ఆరా తీశారు. టీబీ, లెప్రసీ, హెచ్‌ఐవీ కేసుల ల్యాబ్ రిజిస్టర్లు, రికార్డులను, రోగుల వివరాలు, కార్డులను పరిశీలించారు. టీబీ కేసులు తక్కువగా నమోదు కావడంపై ప్రశ్నించారు. అక్కడున్న టీబీ రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు.

ప్రభుత్వమే 108లను నిర్వహించాలి

కంబాలచెరువు: ప్రభుత్వమే నేరుగా 108లను నిర్వహించాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం జిల్లాలోని 108 ఉద్యోగులు యూనియన్ ఆధ్వర్యంలో 108 సమ్మె నోటీసును కలెక్టర్ ప్రశాంతి, జిల్లా డిప్యూటీ వైద్య, ఆరోగ్యశాఖాధికారి శ్రీహరిబాబుకు అందజేశారు. ఉద్యోగ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జుల రమేష్ బాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ట్రెజరర్ జె.వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు. ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ప్రొవైడర్లకు సర్వీస్‌ను అప్పజెప్పడం ద్వారా సర్వీస్ మోటో దెబ్బతింటుందని, ప్రజాధనం దుర్వినియోగమవుతుందన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి మృతి

సీతానగరం: అప్పుల బాధ తట్టుకోలేక గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. కాటవరానికి చెందిన రామకుర్తి సత్యనారాయణ (51) అప్పుల బాధ తట్టుకోలేక మంగళవారం సాయంత్రం 6.30 గంటలకు గడ్డిమందు తాగాడు. అతడిని వెంటనే కుటుంబ సభ్యులు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం 10 గంటలకు మృతి చెందాడు. ఆసుపత్రి సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సినిమాలు



శ్యామల:	కంగువా
సూర్యమినీ:	వెనమ్,సింగం ఎగైన్
సూర్యప్యాలెస్:	కంగువా
శివజ్యోతి:	మట్కా
అనుశ్రీ:	క
స్వామి:	అమరన్
అశోక:	లక్కీభాస్కర్
రాజా:	మట్కా
రంభ:	బఘీరా
ఊర్వశి:	కంగువా
మేనక:	జితేందర్‌రెడ్డి,జాతర
కుమారి:	దేవర
అప్సర:	మట్కా
నామవరం:	
వీఎస్.మహల్:	కంగువా
ధవళేశ్వరం:	
మురళీకృష్ణ:	మట్కా
కడియం:	
వెంకటసూర్య:	కంగువా